# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సిఆర్‌డిఎ సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**

2. **ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

3. **విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహించిన "బోట్ మారథాన్"ను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఈ రోజు ప్రారంభించారు.**

4. **రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ కళాశాలలు ఈ రోజు నుంచి ప్రారంభమయ్యాయి.**

5. **రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నాయి.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏలూరు జిల్లాలోని కొల్లేరు సరస్సు సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. అలాగే రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ – సీఆర్డీఏపై నిర్మాణాలకు అనుమతుల గురించి చర్చించనున్నారు. అనంతరం వివిధ పథకాల అమలు తీరు, రియల్ టైం గవర్నెన్స్– ఆర్టీజీఎస్ పై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విజయవాడలో నూతనంగా నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌ను డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో కలిసి మంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్... 30 సెకన్లు

--------------------------

రాష్ట్ర జలమార్గాల అభివృద్ధి ప్రాధికార సంస్థ -ఎపిఐడబ్ల్యుఎ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలోని పున్నమి ఘాట్ లో నిర్వహించిన "బోట్ మారథాన్" ను మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, తీరప్రాంత అభివృద్ధికి అనుసంధానంగా ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పర్యాటకానికి ప్రాధ్యాన్యమిస్తూ రాష్ట్రం లోని అనేక పర్యాటక కేంద్రాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ కళాశాలలు ఈ రోజు నుండి ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది నుంచి విద్యా సంవత్సరం సమయాల్లో ఇంటర్మీడియట్ విద్యా మండలి పలు మార్పులు చేసింది. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండగా ఈ ఏడాది ఏప్రిల్ 1నే మొదలు పెట్టారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు తరగతులు నిర్వహించి, ఆపై వేసవి సెలవులు ఇచ్చారు. తిరిగి ఈ రోజు 2025-26 విద్యా సంవత్సరం పునఃప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసున్నారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అనకాపల్లి, అనంతపురం, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. కృష్ణాజిల్లా గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డి.కె.బాలజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్... 28 సెకన్లు

---------------------------

దేశంలోని మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రపంచ దేశాలకు సంబందించిన రోజువారీ విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రసారభారతి షబ్ద్ పోర్టల్ వార్తా కథనాల రూపంలో ఉచితంగా అందిస్తోంది. అనేక అంశాలకు సంబంధించి రోజుకి 800కి పైగా వార్తా కథనాలను 15 ప్రాంతీయ భాషల్లో షబ్ద్ పోర్టల్ ద్వారా వీక్షించవచ్చు. కాగా ఈ షబ్ద్ పోర్టల్‌లోని సమాచారాన్ని కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్‌తో పాటు ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని ఎటువంటి కాపీరైట్స్ సమస్యలు ఉండవని ప్రసారభారతి ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

ఉగ్రవాదాన్ని నిర్మూలించే విషయంలో భారత్ తన నిబద్ధతను చాటే ప్రయత్నంలో భాగంగా పార్లమెంట్ సభ్యుల అఖిల పక్ష బృందాల ప్రపంచ దేశాల పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా యునైటెడ్ కింగ్డమ్‌లో పర్యటిస్తున్న బిజెపి ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిల పక్ష బృందం సభ్యులు సెంట్రల్ లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్ గార్డెన్స్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి ఈరోజు నివాళులర్పించారు. అనంతరం అక్కడి ప్రవాస

భారతీయులతో అఖిల పక్ష బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు పురందరేశ్వరి మాట్లాడుతూ,

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

"ఆక్యులర్ ట్రోమా" అని పిలిచే కంటి గాయాల కారణాలు, నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను జాతీయ మానవ హక్కుల కమిషన్-ఎన్ హెచ్ ఆర్ సి నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కంటి గాయాలకు సంబంధించిన ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు పలు సూచనలు చేస్తోంది. క్రీడలు, ప్రమాదకర పని సమయంలో రక్షణ కళ్ళాద్దాలను తప్పనిసరిగా ఉపయోగించాలని, కంటి గాయానికి కారణమయ్యే బాణసంచా నిషేధం అమలు చేయడం వంటివి చేపట్టాలని తెలిపింది.

---------------------------

ఖరీఫ్ సాగుకు తగినట్టుగా రైతులకు ఉపయోగపడేలా దేశవ్యాప్తంగా వికసిత్ కృషి సంకల్ప అభియాన్ రైతు సదస్సులను నిర్వహిస్తున్నామని జాతీయ వాణిజ్య పంటల పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త రాజశేఖర్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం మండలం పేరవరం, తాడిపూడి, ర్యాలీ గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ రైతు సదస్సులను నిర్వహించారు. పంటల సాగులో ఆధునిక విజ్ఞానాన్ని వినియోగించి మెరుగైన దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్త రాజశేఖర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ,

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సూచించారు. ఏలూరు జిల్లా నూజివీడులో మంత్రి కరోనా సన్నద్ధత పై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో కోవిడ్ ను ఎదుర్కోవడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, వైద్యపరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని, అభివృద్ధి పథంలో సాగాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడుతూ వికసిత్ భారత్-2047 నాటికి అగ్రస్థానానికి చేరుకోవాలని చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలో బహుళ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రాధాన్యాలు, కేంద్రాల సామర్థ్యం ఆధారంగా వీలైనంత వరకూ ఒకే జిల్లాలోనే పరీక్ష కేంద్రాలు కేటాయించామని డీఎస్సీ కన్వీనర్ వెంకటకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని సందర్భాల్లోనే అభ్యర్థుల రెండు, మూడో ప్రాధాన్యత పరీక్ష కేంద్రాలను కేటాయించామని, అభ్యర్థులకు పరీక్షకు – పరీక్షకు మధ్య తగిన సమయం కల్పించడం ద్వారా ప్రయాణాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూశామని వెల్లడించారు.

---------------------------

కేంద్రప్రభుత్వం పిఎం శ్రీ పథకం ద్వారా కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి ఆ పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పిస్తోంది. ఈ ఏడాది తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను పీఎంశ్రీ పథకానికి కేంద్రప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత మాట్లాడుతూ తమ పాఠశాలలోని పలు అంశాలను పరిశీలించి ఈ పథకానికి ఎంపిక చేసినందుకు కేంద్రప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పిఎం శ్రీ పథకంతో పాఠశాల విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

========================